ప్రజాశక్తి

మంగళవారం 31 అక్టోబర్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు





పల్లెల్లో డ్రెయినేజి అస్తవ్యస్తం



పిడుగురాళ్ల మండలం చిన్న అగ్రహారం గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

- సైడు కాల్వల్లేక రహదార్లపైనే మురుగునీరు
- దోమలకు ఆవాసం.. వ్యాధులతో సహజీవనం..
- అమలుకు నోచని 2018 నాటి ఉత్తర్వులు
- పారిశుధ్య కార్మికులకు జీతాలకూ డబ్బుల్లేని పంచాయతీలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు గ్రామ పంచాయతీల్లో భూగర్భ డ్రెయినేజి వ్యవస్థ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం కాగితాలకే పరిమితమైంది. గత ప్రభుత్వ హయాలో ఉమ్మడి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో పరిధిలో మొత్తం 15 గ్రామాల్లో ఈ వ్యవస్థ ఏర్పాటుకు రూ.58.03 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2018లో ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం నిధులు కేటాయించినా అప్పట్లో పనులు చేపట్టలేదు. ప్రణాళిక రూపొందించినా కార్యరూపం దాల్చలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పనులను అసలు పట్టించుకోలేదు. తాజాగా గత నాలుగేళ్లలో గ్రామ పంచాయతీలకు తగిన నిధులు కేటాయించకపోవడంతో గ్రామాల్లో మురుగునీటి పారుదలకు చర్యలు లేకుండా పోయాయి. భూగర్భ డ్రెయినేజి వ్యవస్థ కాదు కాదా సాధారణంగా రోడ్లపై నిల్వ ఉన్న వర్షపునీరు బయటకు పోయేందుకు కూడా గ్రామ పంచాయతీలు ప్రణాళికలు రూపొందించలేకపోతున్నారు. కాల్వల్లో మురుగు నీరు కూడా రోజుల తరబడి పేరుకుపోతోంది.

14, 15 ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలు పూర్తిగా ఖర్చుపెట్టుకునేందుకు అవకాశం లేకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యమూ అధ్వానంగా మారుతోంది. మురుగునీటి పారుదల్లేక దోమల బెడద తీవ్రంగా ఉంటోంది. దీంతో వ్యాధులతో గ్రామీణ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో సైడ్ కాల్వల వ్యవస్థ సక్రమంగా లేక మురుగు నీరు పారుదల కష్టతరంగా మారింది. దీంతో తరచూ పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రామాల్లో ఇళ్లల్లో వాడకంనీరు, వర్షం నీరు పారుదలకు సరైన అవకాశం లేక భారీ వర్షాలు కురిస్తే మురుగు నీరుకూడా ఇళ్లల్లోకి వచ్చే పరిస్థితి చాలా గ్రామాల్లో నెలకొంది. మండల కేంద్రాల్లోనూ పరిస్థితి దుర్భరంగా మారుతోంది.

గత ప్రభుత్వ హయాంలో సిమెంట్ రోడ్లు నిర్మించినా సైడ్ కాల్వలు నిర్మించకపోవడం వల్ల మురుగు అంతా ఇళ్ల ముందే చేరుతోంది. ఇళ్లల్లోని వాడకం నీరు బయటకు పోయే మార్గాల్లేక చాలా గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో సైతం ఇళ్లలో వాడకం నీరు పారుదలకు సైడుకాల్వల వ్యవస్థ సక్రమంగా లేదు. వర్షం వస్తే కాలువల్లో మురుగు రోడ్డుపైకి వస్తోంది. దీంతో తొలుత కొన్ని మేజర్ పంచాయతీల్లో భూగర్భ డ్రెయినేజి పథకం అమలు చేయాలని ఆలోచనలు చేసినా అవి కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం పారిశుధ్య సిబ్బందికి జీతాలు ఇవ్వడమే కష్టంగా ఉందని సర్పంచ్‌లు వాపోతున్నారు. ప్రస్తుతం ఆరునెలలుగా వారికి జీతాలు రాని కారణంగా వారు పూర్తిస్థాయిలో విధులకు రాలేకపోతున్నారు. గ్రామాల్లో సైడ్ డ్రెయిన్లలో మురుగునీరు పారుదలకు చర్యలు, వ్యర్థాల తొలగింపు కష్టతరంగా మారింది. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంపై పలుమార్లు సర్పంచ్‌లు నిరసన తెలిపినా ప్రభుత్వం తీరులో మార్పు లేదు.



ఐక్యతా అభివాదం చేస్తున్న విద్యార్థి, యువజన, నిరుద్యోగ, ప్రజా సంఘాల నాయకులు

8న విద్యాసంస్థల బంద్

- విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు సాధన కోసం ప్రత్యక్ష కార్యాచరణ
- విద్యార్థి, యువజన, నిరుద్యోగ, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ చేపట్టనున్నట్లు విద్యార్థి, యువజన, నిరుద్యోగ, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం ప్రకటించింది. ఈ మేరకు సమావేశం నరసరావుపేటలోని ఎన్జీఓ హోంలో సోమవారం నిర్వహించారు. సమావేశానికి ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభానీ అధ్యక్షత వహించగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్జి, ఎపిఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మద్రివేముల శ్రీనివాస్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఏనుగంటి భార్గవ్‌సాయి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోటా సాయి, ఎఐవైఎఫ్ నాయకులు జంగాల చైతన్య మాట్లాడారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ఫ్యాక్టరీ అనుబంధంగా ఇనుము గనులు కేటాయించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో పేర్కొన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ పరిశ్రమ ఏర్పాటైతే లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు.

▶ 2లో

వార్త మెయిన్‌లో



దీక్ష శిబిరంలో నాయకులకు దండలేసి దీక్షలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

పిఎసిఎస్‌ల ప్రైవేటీకరణను విడనాడాలి

- వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల యూనియన్ రిలే దీక్షల్లో ఎమ్మెల్సీ లక్ష్మణరావు
- కమిషనరేట్ వద్ద మూడ్రోజుల దీక్షలు ప్రారంభం



తుళ్లూరులో ప్రచారం చేస్తున్న సిపిఎం శ్రేణులు

అసమానతల్లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రణాళిక

- ప్రజారక్షణ భేరి జయప్రదం కోసం పలుచోట్ల ప్రచారాలు
- 15న బహిరంగ సభకు తరలిరావాలని పిలుపు

5 లో



నేడు టిడిపి,జనసేన సంయుక్త భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం అరండల్‌పేటలోని జిల్లా టిడిపి కార్యాలయంలో జరగనుంది. ఈ సమావేశంపై ముందస్తు చర్చలు టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగాయి. టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు వివిధ అంశాలపై చర్చించారు. ఉమ్మడి కార్యచరణ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం తదితర అంశాలపై మంగళవారం సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు. ఎన్నికల్లో పొత్తు అంశాల కంటే ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాడాలనే అంశంపైనే చర్చించాలని తలపెట్టారు. సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, టిడిపి నాయకులు దాసరి రాజామాస్టారు, కంచర్ల శివరామయ్య, ఒంకార్ పాల్గొన్నారు.



మినప పప్పు లోడు లారీ బోల్తా

ప్రజాశక్తి -తెనాలి

మినపప్పు లోడుతో ఉన్న లారీ కాలవలో బోల్తా పడింది. బుర్రిపాలెం రోడ్డులో డాల్ మిల్స్ ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి సోమవారం మినప పప్పు లోడుతో వెళుతున్న లారీ బీసీ కాలనీ వద్ద కాలువ అంచున నిలిపి ఉంచారు. లారీ హెవీ లోడ్ ఉండటంతో మట్టి కుంగి లారీ కాలువలో బోల్తా కొట్టింది. లారీలో ఉన్న10 టన్నుల మినపప్పు నీటి పాలైంది. బోల్తా పడిన సమయంలో లారీలో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది.

కార్మికుని మృతికి నరేంద్ర సంతాపం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పట్టణంలోని 30వ వార్డుకు చెందిన తాపీ కార్మికుడు కలగంటి శ్రీరాములు మూడంతస్తుల భవనంపై నుండి పడి మృతి చెందడంతో మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ సందర్శించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయనవెంట నాయకులు శ్రీరామ్మూర్తి, అహ్మద్‌ఖాన్, వరప్రసాద్ ఉన్నారు.

8న విద్యాసంస్థల బంద్

(మొదటి పేజీ తరువాయి)

విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాల అభ్యున్నతికి నిధులివ్వకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఃపరిశ్రమలు ఏర్పాటు హామీలను కేంద్రం విస్మరించడంపై రాష్ట్రంలోని బిజెపి నేతలు ఎందుకు అడగడం లేదని నిలదీశారు. రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వివిధ సంఘాల నాయకులు టి.బాబురావు, యు.రాము, కె.రాంబాబు, బి.శ్రీనివాసరావు, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కంటే ముఖ్యమంత్రికి వ్యక్తిగత ప్రయోజనాలు ఎక్కువయ్యాయని విమర్శించారు. కేసుల భయంతో మోడీ ముందు మోకరిల్లుతున్నారని మండిపడ్డారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం రెండుసార్లు శంకుస్థాపన చేసినా ఆచరణలో పురోగతి లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో యు.రంగయ్య, వి.వెంకట్ పాల్గొన్నారు.

వైద్య రంగానికి ప్రాధాన్యం : హెనీక్రిస్టినా



గుండాలపాడులో కార్డులు అందిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్

ప్రజాశక్తి-ఫిరంగిపురం


జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్‌పి చైర్‌పర్సన్ కె.హెనీక్రిస్టినా అన్నారు. మండలంలోని గుండాలపాడులో సోమవారం నిర్వహించిన శిబిరాన్ని సందర్శించిన చైర్‌పర్సన్ మాట్లాడుతూ వైద్య రంగానికి వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, పేదల ఇంటివద్దకే వైద్యాన్ని తెచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సహేలా నర్గీస్, జెడ్‌పిటిసి కత్తిరేనమ్మ, వైసిపి మండల అధ్యక్షులు ఎం.శివారెడ్డి, వైద్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక పాండురంగ పేట షాది ఖానా ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో జనరల్ ఓపి-69, డెర్మటాలజీ-28, రేడియాలజీ-26 మంది, ఆప్తమాలజి-68 ఓపిలు వచ్చినట్లు మున్సిపల్ వైద్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల తెలిపారు. డాక్టర్ ఉషారాణి, డాక్టర్ షేక్ బీబి జాన్, డాక్టర్ వి.మహిత వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు సందర్శించగా 26వ వార్డు కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్, ఎన్‌హెచ్‌ఎం డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజింగ్ అధికారి డాక్టర్ చుక్క రత్న మన్మోహన్, డిపిఎంఒ జె.శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, టీబి సూపర్వైజర్ పి.రవికుమార్, ఇన్‌ఛార్జి అడ్మిన్ సిహెచ్ రాఘవేంద్రరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కాకుమాను

మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాలు ముగిసిన నేపథ్యంలో మండల కేంద్రమైన కాకుమానులో సోమవారం ముగింపు శిబిరం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి టి.ప్రేమకుమారి మాట్లాడుతూ శిబిరాల నిర్వహణకు అందరూ సహకరించారని, జయప్రదంగా కొనసాగాయని అభినందించారు. ఈ సందర్భంగా వైద్యులను సన్మానించారు. ఎంపిపి కె.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి ఎన్.గుల్జార్ బేగం, వైస్ ఎంపిపి కపిల్‌దేవ్, ఎంపిటిసి కె.పరమేశ్వరరావు, తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఒ రామకృష్ణ పాల్గొన్నారు.



కాకుమానులో వైద్యులకు సన్మానం

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాక జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పిహెచ్‌సి వైద్య సిబ్బంది, పెనుమాక సెక్టార్ అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మంత్రి అంబటి రాంబాబుపై దాడి సిగ్గుచేటు

పరామర్శించిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్యవరప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

టిడిపికి చెందిన ఒక సామాజిక తరగతివారు మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో దాడికి ప్రయత్నించటం సిగ్గుచేటని ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎల్.అప్పిరెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ విమర్శించారు. సోమవారం వారు గుంటూరులోని మంత్రి అంబటి రాంబాబు నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ గతంలో ఖమ్మంలో వనసమారాధన సందర్భంగా అంబటిని అంతమొందిస్తే రూ.50 లక్షలు ఇస్తామని కొంతమంది వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఇటువంటి పరిణామాలు టిడిపికి ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం రాజకీయాల్లో ఒక పద్ధతి అని విమర్శలు చేసినవారందరినీ దాడి చేసి అంతమొందించాలరని అనుకోవడం శ్రేయస్కరం కాదన్నారు. గతంలో ఏ పార్టీ ఇలా వ్యవహరించలేదన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని, కానీ ఇలా భౌతిక దాడులకు పాల్పడటం తగదన్నారు. దాడులకు ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఖమ్మంలో జరిగిన దాడిపై తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైసిపికి చెందిన కాపు సంఘం నాయకులు, కార్యకర్తలు వచ్చి అంబటి రాంబాబుకు సంఘీభావం తెలిపారు.



వీర క్షత్రియులకు ప్రాతినిధ్యం కల్పించండి

సంఘం రాష్ట్ర, యువజన, మహిళా విభాగాల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాబోయే ఎన్నికల్లో తొగట వీర క్షత్రియులకు అన్ని పార్టీలు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడం వీరాంజనేయ ప్రసాద్ డిమాండ్ చేశారు. తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం గుంటూరు నగరం అమరావతి రోడ్ లోని బండ్లమూడి గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడం వీరాంజనేయ ప్రసాద్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. దివ్య జ్ఞానానంద భారతి స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర యువజన, మహిళా విభాగాలకు నూతనంగా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. యువజన అధ్యక్షులుగా నలమార అరుణ్ బాబు, మహిళా అధ్యక్షురాలుగా సురువు శ్రీలత తదితరులతో నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. సభా అధ్యక్షులుగా బడిగుంచాల చంద్రమౌళి వ్యవహరించారు. జాతీయ అధ్యక్షులు పల్లా శేషయ్య, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకారపు జయశ్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, రాష్ట్ర కోశాధికారి నలమార శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, రాష్ట్ర మహిళా అధ్యక్షులు శ్రీలత,మహిళా ప్రధాన కార్యదర్శి రేణుక పాల్గొన్నారు. రాష్ట్ర జనాభాలో ఆరు శాతం ఉన్న తొగటవీర క్షత్రియులకు నాలుగు ఎమ్మెల్యే సీట్లు, రెండు ఎంపి సీట్లు, ఒక మంత్రి, ఒక రాజ్యసభ పదవులను కేటాయించాలన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటుకు పరిశీలన



డీఎస్పీ తో కలిసి కూడళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటుపై ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సోమవారం పట్టణంలో పర్యటించారు. డీఎస్పీ బి.జనార్ధన రావు తో కలిసి సాయిబాబా టెంపుల్ కూడలి, కొత్త వంతెన, చెంచుపేట ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద తదితర ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీ ఉన్నచోట్ల ప్రమాదాలకు ఆస్కారం లేకుండా సిగ్నల్స్ ఏర్పాటుపై పోలీసు సిబ్బంది, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానికులు ఇచ్చిన సూచనలు, సలహాల మేరకు పట్టణంలో 9 ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఆవశ్యకతను గుర్తించినట్లు చెప్పారు .దుగ్గిరాల కాంటినెంటల్ కాఫీ వర్క్స్ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్ సహకారంతో సిగ్నల్స్ వ్యవస్థను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట టౌన్ ప్లానింగ్ ఏ సి పి 2 ఎల్ సుబ్బారావు, వన్ టౌన్ సిఐ కె చంద్రశేఖర్, 3 టౌన్ సిఐ బి రమేష్ బాబు, ట్రాఫిక్ ఎస్ఐ శివరామయ్య, ఇంచార్జ్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ తదితరులున్నారు.

సత్తెనపల్లిలో ఆగిన విశాఖ ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

సికింద్రాబాద్ నుండి భువనేశ్వర్ వెళ్ళే విశాఖ ఎక్స్ ప్రెస్ రైలు సత్తెనపల్లి రైల్వే స్టేషన్ లో ఆదివారం రాత్రి సుమారు గంటన్నర సేపు ఆగింది. విజయనగరం వద్ద రెండు రైళ్లు ఢీకొట్టిన సంఘటన నేపథ్యంలో ట్రైన్ నెంబర్ 17016 సింకిద్రాబాద్ నుండి భువనేశ్వర్ వెళుతున్న విశాఖ ఎక్స్ ప్రెస్ ను గంటన్నర సేపు అధికారులు నిలిపివేశారు. సహాయ చర్యలు జరుగుతున్న క్రమంలో రైలు అన్ని స్టేషన్లలో గంటసేపు నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గంటసేపు రైలు ఆగటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. 9 .10గంటలకు వచ్చిన రైలు 10.20బయలుదేరి వెళ్ళింది.

వైసిపిని సాగనంపాలి : టిడిపి

ప్రజాశక్తి -పెదకూరపాడు

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపాలని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం మండలంలోని లింగగుంట్ల గ్రామంలో బాబుతో నేను, బాబు షురిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. అనంతరం మేదరమెట్ల సాంబశివరావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆయన వెంట పెదకూరపాడు మండల టిడిపి అధ్యక్షులు రమేష్, మాజీ ఎంపీపీ గళ్ళా అప్పారావు, మాజీ డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, ఆ గ్రామ నాయకులు పాల్గొన్నారు.





మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 30,151
మిర్చి ఎగుమతి	: 28,272
మిర్చి నిల్వ	: 9,770

మిర్చి ధరలు

రూపాయలలో

334	12,500 - 23,000
నెం.5	20,000 - 21,000
273	19,500 - 20,000
341	10,000 - 21,600
	నాన్ ఎసి
తేజ	10,000 - 24,700
బడిగి	11,000 - 26,000
దేవనూరు డీలక్స్	11,000 - 21,000
తాలుకాయలు	7,000 -14,500
	ఎసి
334	14,300 - 21,000
273	21,000 - 21,000
341	14,000 - 22,500
తేజ	10,000 - 24,000
బడిగి	16,000 - 25,000
దేవనూరు డీలక్స్	15,500 - 22,000
తాలుకాయలు	7,000 -13,000

ఉరేసుకుని కూలీ ఆత్మహత్య

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండల పరిధి లోని చిన్న కొండ్రుపాడులోని పోలిశెట్టి సుందరం టొబాకో కంపెనీలో చోటు చేసు కుంది. ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు టౌన్, నందమూరి కాలని 1 వ లైనుకు చెందిన మల్లెం వీరాంజనేయులు (55) గత కొంత కాలంగా ఈ టొబాకో కంపెనీలో కూలి పనులు చేసుకొని జీవిస్తున్నాడు. గతంలో తన ఇంటి అవసరాల నిమిత్తం రూ. 5,00,000 అప్పు చేశాడు. ఆ అప్పులు ఎలా తీర్చా లా అనే విషయమై కొంత కాలంగా బాధ పడుతున్నాడు.



మృతుడు మల్లెం వీరాంజనేయులు

ఈ క్రమంలో ఈ నెల 29వ తేదీన సాయంత్రం సుమారు 5:42 గంటల సమయంలో టొబాకో కంపెని గోడౌన్‌లో ఉరివేస కున్నాడు. ఈ విషయం గమనించిన ఇతర కూలీలు జిజిహెచ్‌కు తరలించారు. అప్పటికే వీరాంజనేయులు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీ కరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు ఇదే కంపెనీ లో వేరె బ్రాంచ్‌లో పని చేసే సమయంలో తన చేతిని కోల్పోయాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



పాదచారుని కారు ఢీ కొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం నందిగామ పంచాయతీ పరిధిలోని మురళీనగర్ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఈప్రమాదంలో నంది గామకు చెందిన మోది కిరణ్ బాబు (19) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. క్రోసూరు మండలం ఉయ్యదన నుండి గుంటూరు వెళుతున్న కారు రోడ్డు పక్కన ఉన్న కిరణ్ బాబును ఢీకొట్టడంతో. తీవ్రంగా గాయపడ్డాడు మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గేదెలను అపహరిస్తున్న నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-నూజెండ్ల

ఈ నెల 25వ తేదీన మండలంలో గేదెల దొంగత నానికి పాల్పడ్డ నిందితులను త్రిపురాపురం గ్రామస్తులు పట్టుకుని, వారిని పోలీసులకు అప్పగించారు. కంభంపాటి ప్రభుదాసు (కొత్త త్రిపురాపురం), మందా వెంకయ్య (మతుకుమల్లి), కాకాని కోటయ్య (కంభంపాడు), కడియం కోటయ్య (మూగ చింతలపాలెం)లు గ్రామాల్లో రోడ్లపై తిరుగుతున్న గేదెలను అపహరించి తీసుకు వెళుతున్నారు. ఇది గమనించిన త్రిపురాపురం గ్రామస్తులు, నిందితులు నలుగురిని, అపహరించిన గేదెలను పట్టుకుని ఐనఓలు పోలీసులకు అప్పగించారు. వినుకొండ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్, తమ సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో మండలంలోని మదమంచిపాడు టెంపుల్ వద్ద అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం వినుకొండ కోర్టుకు తరలించారు. నాలుగు గేదెల విలువ రూ. 2,00,000 ఉంటుందని, ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వినుకొండకు చెందిన కంభం పాటి రాకేష్ కు చెందిన 3 గేదెలు, మండలంలోని కొత్త త్రిపురాపురానికి చెందిన అమర్తపూడి అంకాలు కు చెందిన ఒక గేదేను నిందితులు అపహరించారు.



ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

పల్నాడు జిల్లా,నరసరావుపేట పట్టణం,రామ్‌నగర్ 1వ లైను, R/D.No 21-1-50a ఫ్లాట్ నెం 81 కి చెందిన తన్నీరు వెంకటేశ్వర్లు S/o కోటయ్య(లేటు) అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నరసరావుపేట రిజిస్ట్రార్ కార్యాలయంలో 7-09-2006 న రిజిస్టర్ కాబడిన (డాక్యుమెంట్ నెం. 9988 / 2006)ఒరిజినల్ డాక్యుమెంట్‌ను 15-10-2023న జిరాక్స్ నిమిత్తం ఇంటి వద్ద నుండి పాతూరు శివాలయం వైపు ద్విచక్రవాహనం మీద వెళుతుండగా మార్గ మధ్యలో ఎక్కడో పడిపోయింది. ఎంత వెతికినను కనపడలేదు. నేను ఏ బ్యాంకులో గాని బయట వ్యక్తుల వద్దగాని అమ్మివుండటం ఏమియును చేయలేదు. సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్‌లో లేదా 9849813186 నెం.లో సంప్రదించగలరు. సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికి వాటిని దుర్వినియో పరిస్తే చట్టపరంగా నేను తీసుకునే చర్యలకు బాధ్యులగుదురు.

విజ్ఞాపనలను పరిష్కరించండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



స్పందనలో వచ్చిన విజ్ఞాపనలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్‌పి సుప్రజ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి ,సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. సదరు సమస్యలు పరిష్కరించాలి అని సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లాలోని అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. సుప్రజతో పాటు క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు , డిసిఆర్బి డిఎస్పి శ్రీనివాసరావు, ట్రాఫిక్ డిఎస్పి బాల సుందర రావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆమె స్పందనలో పలువురి నుంచి అర్జిలు స్వీకరించారు.

నూతన తహశీల్దారుగా క్షమారాణి బాధ్యతలు

ప్రజాశక్తి-బెల్లంకొండ



బెల్లంకొండ నూతన తహశీల్దార్ గా క్షమారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అచ్చంపేట లో మూడేళ్లు, పెదకూరపాడులో రెండేళ్లు, సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో 20 రోజులుగా వివిధ కార్యక్రమాలలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు తమ సేవలను అందిస్తామని అన్నారు.

బీఎల్వోల సమావేశం

ఎన్నికల కమిషనర్ ఆదేశాలలో తప్పక పాటిస్తామని బెల్లంకొండ తహశీల్దార్ క్షమారాణి అన్నారు. మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బిఎల్వోల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షమారాణి మాట్లాడుతూ మండలంలో రెండు చోట్ల ఓట్లు ఉన్న వారిని , అలాగే గ్రామాల్లో లేని వారిని, గ్రామాలకు సంబంధంలేని వారిని, ఇతర కారణాలతో ఎప్పుడు గ్రామాలను విడిచిన వారిని గుర్తించి వారి పేర్లను ఓటర్ లిస్ట్ లో నుంచి తప్పించి సరైన ఓటర్ల జాబితాల తయారు చేయాలని, ఈ బాధ్యత బిఎల్ఓలపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా బిఎల్ఓలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



రాష్ట్ర స్థాయి హాకీ జట్టుకు జెడ్పి విద్యార్థినులు

ప్రజాశక్తి- పెదకూరపాడు

పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో హాకీ జట్టుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ సోమవారం తెలిపారు. అండర్-14 విభాగములో ఇద్దరు, అండర్-19 విభాగంలో ఇద్దరు ఎంపికైనట్లు వివరించారు. శిక్షణ ఇచ్చిన పిఈటి నాగరాజును, విద్యార్థులను ఆయన అభినందించారు.



మురుగునీటి దుర్గంధం

ప్రజాశక్తి- క్రోసూరు

మండల పరిధిలోని దొడ్లేరులో మురుగు నీరు, దుర్గంధంతో సచివాలయం సిబ్బంది,చుట్టుపక్కల జనం అల్లాడిపోతున్నారు. పంచాయతి ఆఫీస్, ఆ పక్కనే ఉన్న రైతు భరోసా కేంద్రం-2, కార్యాలయం, వాటి వెనుక సచివాలయం- 1,2 లలో పనిచేసే సిబ్బంది ఈ దుర్గంధం తట్టుకోలేకపోతున్నారు. ఒక పక్క మురుగు,మరోపక్క దోమల బాధతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. దొడ్లేరు గ్రామస్తులు మాట్లా డుతూ మురుగు నీరు ఇళ్ల ముందు నిల్వ ఉండటంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారని అన్నారు. ఇంటికి ఆనుకొని మురుగు కుంట ఉంటే ఎలా భరించగలమని అంటున్నారు. ఇంటి ముందు, ప్రభుత్వ కార్యాలయాల ముందు మురుగునీరు ఉంటోందని, ఈ విషయాన్ని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

హద్దులు దాటి పెరుగుతున్న నిత్యావసరాల ధరలు

- ప్రజలు నిరసనలకు కదిలిరావాలి
- 7న పల్నా జిల్లాకు ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర రాక, సత్తెనపల్లిలో బహిరంగ సభ
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి- మాచర్ల

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతో నిత్యావసరాల ధరలు హద్దులు దాటి పెరుగుతున్నాయని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ డివిజన్ కమిటీ సమావేశానికి ముఖ్య అతి థిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల అధిక ధరలతో అన్ని వర్గాల ప్రజలు అల్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలను అదుపుచేయడంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. ప్రజా వ్యతిరేక విధా నాలు, అధిక ధరలకు నిరసనగా ప్రజలు స్వచ్ఛందంగా పోరాటాలకు కదిలిరావాలని పిలుపు నిచ్చారు. అయిల్, గ్యాస్ ధరలు కూడ ప్రజలు భరించలేని విధంగా ఉన్నట్లు వివరించారు. వీటి ప్రభావం వలన నిత్య వసరాల ధరలు కూడ విపరీతంగా పెరుగుతున్నట్లు వివరించారు. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం అవకాశవాద రాజకీయాలను అవ లంబిస్తోందని, వెంటనే నిత్యవసరాల ఎగుమతులను నిషేధించాలన్నారు. నిరుద్యోగులు ఎదుర్కోంటున్న సమస్యలు, ప్రజలపై పడుతున్న భారాల సమస్య, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలపై జగన్ ప్రభుత్వం ఏ మాత్రం స్పందించటం లేదని విమర్శించారు. నిరుద్యోగులు ఎదుర్కోంటున్న సమస్యలు, ప్రజలపై పడుతున్న భారాల సమస్య, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలపై జగన్ ప్రభుత్వం ఏ మాత్రం స్పందించటం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ కార్పొరేట్ సేవలో తరిస్తూ కృష్ణపట్నం, గంగవరం పోర్టులతో పాటు రాష్ట్ర ప్రజల సంపదను వారికి కట్టబెడుతున్నారని విమర్శించారు. సిఎస్‌టిబిసి కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి కీలుబొమ్మను చేసినట్లు తెలిపారు. వాటికి నిధులు కేటయించలేదన్నారు. నిరు ద్యోగులు ఎదురుచూస్తున్న మెగా డిఎస్‌సి ఎప్పుడు వేస్తారో తెలియటం లేదన్నారు. రాష్ట్రంలో నెలకన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఎలాంటి మేలు చేస్తారో రాష్ట్ర ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మాచర్ల ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం వరికపూడిశెల ప్రాజెక్టు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో వెంటనే చెప్పా లని, ఇటువంటి సమస్యలన్నింటిపై సిపిఎం ప్రచార జాతాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు. విశాఖ ఉక్కు, లేబర్ కోడ్స్, మతవిద్వేషాలు, విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణ, మూడు రాజధానుల పేరిట ప్రజలను మోసం చేయడం, విద్యుత్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ మోటార్లకు మీటర్లు, ప్రజలపై పన్నుల భారాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు మొదలైన అంశాల గురించి విజయకుమార్ ప్రస్తావించారు. వచ్చే నెల 7న పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటకు రానున్న ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రకు ఘన స్వాగతం పలకడంతో పాటు బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నవంబర్ 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ ద్వారా ప్రభు త్వాలను నిలదీయనున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రచార జాతాలకు మద్దతు తెలిపి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు నాయక్ స్థానిక నేతలు బండ్ల మహేష్, వై.సురేష్ వెంకటరత్నం, శోభన్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడతున్న గుంటూరు విజయకుమార్


ప్రచారజాతలో మాట్లాడుతున వై.రాధాకృష్ణ

బిజెపిని ఓడిస్తేనే హక్కులను కాపాడుకోగలం

ప్రజాశక్తి-యడ్లపాడు

ప్రజా సమస్యలే ఎజెండాగా రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు అమలు చేయాల్సిన ప్రజాప్రణాళికను సిపిఎం ప్రజలముందు ఉంచు తుందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సిపిఎం ప్రజారక్షణ భేరి ప్రజార జాత నిర్వహించారు. తిమ్మాపురం, దింతెనపాడు,సందెపూడి,తుర్లపాడు, జాలాది, జగ్గాపురం, కారుచోల, గుత్తావారిపాలెం, యడ్లపాడు, వంకాయలపాడు, బోయపాలెం,ఉన్నవ గ్రామాల్లో నిర్వహించిన ప్రజార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వాదాన్ని , రాజ్యాంగాన్ని కాపాడటం కోసం సిపిఎం కృషి చేస్తోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బిజెపి విధానాలకు నిరసిస్తూ కలిసి వచ్చే అన్ని శక్తులను కలుపుకొని సిపిఎం పోరాడు తుందని స్పష్టం చేశారు. రైతులు ,కార్మికులు , మహిళలు, విద్యార్థులు చేసే పోరాటాలకు సిపిఎం అండగా నిలబడుతుందని అన్నారు.వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించడం ద్వారానే రాష్ట్రాల హక్కులను, ప్రజాస్వామ్య హక్కులను , మానవహక్కుల ను కాపాడుకోగలమని అన్నారు. ఆయా చోట్ల జరిగిన జాతాలో సిపిఎం మండల కన్వీనర్ తోకల కోటేశ్వర రావు, సిపిఎం నాయకులు నూతలపాటి కాళిదాసు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, కారుచోల రోశయ్య, జరుగుల శంకరరావు,విల్సన్, పి.శ్రీను పాల్గొ న్నారు.

ప్రజాశక్తి-నకరికల్లు

సిపిఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణభేరి ప్రచార జాతర మండలంలోని నకరికల్లు, నరసింగపాడు బాలాజీ నగర్ తండా గుండ్లపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సంద ర్భంగా పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర, ప్రతి ఎకరాకు సాగు నీరు, మోటార్లకు ఉచిత విద్యుత్, ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు అందజేయాలన్నారు. నవంబర్ 15న విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం తహశీల్దార్ నగేష్ కు భూ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గాడిద మల్ల పిచ్చారావు, ఈవురి లక్ష్మారెడ్డి, గోదా చిన్ని పాల్గొన్నారు.


తహశీల్దార్ నగేష్ కు వినతి పత్రం చేస్తున్న సిపిఎం నాయకులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలి

పలానడు జిల్లా జెసి శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

'విద్యుత్ పొదుపు - అభివృద్ధికి మదుపు' అనే నినాదాన్ని విద్యుత్‌వాడకందారులకు పొదుపు పాటించడం ద్వారా అల వర్చుకోవాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. విద్యుత్ వాడకంపై ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా పల్నాడు జిల్లా నరసరావుపేట ఏపీ సి డిపిసిఎల్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కలెక్టరేట్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసితో పాటు ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్ఓ వినాయకం, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత బాబు, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పొదుపు ఇంధన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. విద్యుత్ ను పొదుపు చేయడం వల్ల నిరంతరం వినియోగించుకోవడానికి, వ్యవసాయ పంటలకు 9 గంటలు, గహ వినియోగానికి 24 గంటలు వినియోగించ వచ్చునని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గోడ పత్రికలు, కరపత్రాలు ఆవి ష్కరించి విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ నరసరావుపేట డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మంగళగిరి మండలం ఆత్మకూరులో


మంగళగిరిలో


మేడికొండూరులో

అసమానతల్లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రణాళిక

ప్రజారక్షణ భేరి జయప్రదం కోసం పలుచోట్ల ప్రచారాలు


తుళ్లూరులో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి - తుళ్లూరు

సిపిఎం ఆధ్వర్యంలో 15వ తేదీన విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణభేరి బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి కోరారు. ఈ మేరకు సోమవారం రాజధానిలో విస్తృతంగా ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. రవి మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రణాళికను రూపొందించిందని, దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రల ద్వారా ప్రచారం చేస్తోందని చెప్పారు. ముగింపు సభ విజయవాడలో ఉంటుందన్నారు. అమరావతినే రాజధానిగా కొనసాగిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మేలో రాజధాని రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన వార్షిక కౌలును అక్టోబర్ పూర్తి అవుతున్నా ఇప్పటివరకు చెల్లించలేదని, రాజధాని రైతులు పట్ల రాష్ట్ర ప్రభుత్వ కక్షపూరిత వైఖరికి ఇది నిదర్శనమని విమర్శించారు. కౌలు చెల్లిస్తుందో లేదో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. రాజధాని పేదలకు సామాజిక పింఛను ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. రాజధాని పేదలకు ఉపాధి లేకుండా చేసి, కార్మికులను తీవ్రంగా వేధింపులకు గురిచేస్తున్న వైసిపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అసంఘటితరంగ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇచ్చేలా సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలని, స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా మోసం చేసిన కేంద్రంలోని బిజెపిని ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరారు. రూ400కే గ్యాస్, రూ.60కే లీటర్ పెట్రోల్, రూపాయికి ఒక యూనిట్ కరెంట్, ఉచితంగా ఇసుక ఇవ్వాలని కోరారు. నిత్యావసరాల ధరలు తగ్గించాలన్నారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని, వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీటిపై సిపిఎం చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.వెంకటేశ్వరరావు, పి.బాబురావు, కె.ఆంజనేయులు, షేక్ జానీ, కె.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసరావు, సిహెచ్ కృష్ణారావు, నరసమ్మ, నాగమల్లేశ్వరరావు, బి.రాజు, ఎస్.గురుకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని ఆత్మకూరులో ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం నిర్వహించగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు సమర్ధిస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలే అజెండాగా సిపిఎం పార్టీ నిర్వహించే పోరాటాలకు జనం మద్దతు నివ్వాలని కోరారు. ప్రజారక్షణభేరి బహిరంగ సభ పోస్టర్, ప్రజాప్రణాళికను ఆవిష్కరించారు. ఎం.పకీరయ్య, యు.దుర్గారావు, సిహెచ్.జనార్ధనరావు, జి.అజయ్ కుమార్, సిహెచ్.సీతారామాంజనేయులు, బి.రాంబాబు, సిహెచ్.గిరిధరరావు, ఆనందం బాబ్జి, వి.సురేష్, ఎం.శీను, జి.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య అన్నారు. పట్టణంలోని గోపాల్ కృష్ణ సెంటర్ శాఖ సమావేశం సోమవారం రాత్రి స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ఇ.కాటమరాజు అధ్యక్ష వహించారు. చెంగయ్య మాట్లాడుతూ ప్రజలపై భారాలు మోపే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రచార జాతాలు చేపట్టిందన్నారు. నవంబర్ రెండో తేదీన మంగళగిరిలో జరిగే కంటే రంగారావు వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎం.వెంకటేష్, జి.వెంకయ్య, కె.మణికుమారి, సోమయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి -మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరులో నిర్వహించిన సమావేశంలో సిపిఎం నాయకులు బి.రామకృష్ణ మాట్లాడారు. సాగర్ కుడికాల్వ పరిధిలో ఎక్కువ మంది మిర్చి సాగు చేశారని, ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి అయ్యిందని చెప్పారు. అయితే సాగునీటిని విడుదల చేయని కారణంగా రైతులిప్పుడు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వెలిబుచ్చారు. పంటలను కాపాడాలనే ఆలోచనే ప్రభుత్వంలో లోపించిందని విమర్శించారు. రబీ పంటలైన జొన్న, మొక్కజొన్న సాగుకు నీరు ఇవ్వలేమని, వాటికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు వేసుకోవాలని ప్రభుత్వం నాయకులు చెప్పటం బాధాకరమన్నారు. దేశాన్ని బిజెపి ప్రభుత్వం దివాలా తీయిస్తోందని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు బి.శ్రీనివాసరావు, ఎస్ఎం బాష, డి.వెంకటేశ్వర్లు, ఎస్కె షరీఫ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ గిరిధర్ రెడ్డి

రేటూరులో సంధ్యాశిబిరం

ప్రజాశక్తి - కాకుమాను : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాకుమాను శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రేటూరులో సోమవారం సంధ్యా శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు, డ్వాక్రా మహిళలకు రుణ సదుపాయంపై వివరించారు. వివిధ పథకాలపై ఎస్‌బిఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి అవగాహన కల్పించారు. వైస్ సర్పంచ్ వి.సుధాకర్, బ్యాంకు అధికారి వెంకటేశ్వరరావు, వెలుగు సీసీలు సుబ్బారావు, రాఘవ పాల్గొనారు.

ఉచిత ఆయుర్వేద శిబిరం

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్ : స్థానిక శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా సంస్థ విజయవాడ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఆలయ పాలక మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర్‌రావు ప్రారంభించారు. వైద్యులు పి.కన్నన్, ఎం.సురేష్, వి.భానుప్రకాష్, ఖాదర్ మొహిద్దిన్ వైద్య సేవలు అందించారు.



ఇళ్ల పట్టాలు, పన్నుల కోసం సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటిఎంసి) పరిధిలోని ఆత్మకూరులోని నిమ్మగడ్డ రామ్మోహనరావు నగర్, వైఎస్ఆర్ కాలనీలకు, గ్రామంలోని వివిధ పోరంబోకు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారికి ఇంటి పన్నులు వేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు నివాసితులు ఎంటిఎంసి కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి యు.దుర్గారావు మాట్లాడుతూ ఆత్మకూరులో సుమారు 2 వేల కుటుంబాలు ఎన్నో ఏళ్ల నుండి ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నట్లు చెప్పారు. వీరు ప్రభుత్వ పక్క గృహ పథకం, విద్యుత్, నీటి కుళాయి కనెక్షన్లు, సంక్షేమ పథకాలు తదితరాలకు అర్హత పొందలేకపోతున్నారని చెప్పారు. అర్హత పొందాలంటే ఇంటి పట్టా లేదా పన్ను తప్పనిసరి అని అధికారులు చెబుతున్న నేపథ్యంలో వాటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ యు.శారదాదేవికి వినతిపత్రం ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ గ్రామ కార్యదర్శిని సంప్రదించి వివిధ ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని నివసించే వారికి ఏ రూపంలో పన్నులు వేయాలో పరిశీలించి పన్నులు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.అజయ్‌కుమార్, సిహెచ్.సీతారామాంజనేయులు, బి.రాంబాబు, సిహెచ్.గిరిధరరావు, ఆనందం బాబ్జి, వి.సురేష్, ఎం.శ్రీను, కె.లక్ష్మి, జి.లక్ష్మి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పేదింటికి కూల్చివేత భయం

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని ప్రకాష్‌నగర్ సెంటర్‌లో అర్బన్ హెల్త్ సెంటర్ సమీపంలో పేదవాని ఇంటిని కూల్చివేసేందుకు రెవెన్యూ అధికారులు రంగం సిద్ధం చేశారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంలో తామేమి చేయలేమని పోలీసులు చేతులెత్తేయడంతో బాధిత కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది.



కెఎల్‌యును సందర్శించిన జర్మని విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

జెర్మనీలోని బెర్లిన్ నగరంలో చదువుతున్న పలు విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు సోమవారం వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యునివర్సిటీని సందర్శించారు. థామస్ బెర్గర్ నేతృత్వంలో వచ్చిన ఈ బృందాన్ని అంతర్జాతీయ సంబంధాల విభాగం డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, విదేశీ భాషల విభాగ అధ్యక్షులు డాక్టర్ జమీందారులు ఆహ్వానించి యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో అధ్యయనం, పరిశోధనల గురించి వివరించారు. విద్యార్థుల యాక్టివిటీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సాయివిజయ్ పలు విషయాలను తెలిపారు. వర్సిటీ విద్యార్థులతో ఆటపాటలతో కూడిన కార్యక్రమం తరువాత వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావును కలిశారు. ఇరుదేశాల్లోని విద్యా విధానాల గురించి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య పరస్పరం విద్యార్థుల మార్పిడికి సంబంధించి ఒక అవగాహన జరిగిందని డాక్టర్ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్‌లు డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, అంతర్జాతీయ సంభందాల డైరెక్టర్ డాక్టర్ విజయ్ మారుతి పాల్గొన్నారు.



వ్యవస్థలను నాశనం చేస్తున్న జగన్ : టిడిపి

ప్రజాశక్తి - దుగ్గిరాల : ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాశనం చేస్తున్నారని గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు విమర్శించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా న్యాయపోరాటంలో భాగంగా మహిళలు సోమవారం విజయవాడలో కనకదుర్గమ్మను దర్శించుకుని మంగళగిరి టిడిపి కార్యాలయానికి కాలినడకన వస్తుండగా వారిని పోలీసులు అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారిని పరామర్శించేందుకు వచ్చిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అరెస్టయిన వారిని స్థానిక టిడిపి నాయకులు వి.ప్రసాద్, ఎన్.నాని, జె.నరేంద్ర పరామర్శించారు.

దేవాదాయ ధర్మదాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ సలహా మండలి సమావేశం సీతానగరంలోని సీత కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. సమావేశానికి దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.నత్యనారాయణ హాజరవగా పలు విషయాలు చర్చించి తీర్మానాలు చేశారు. దేవాలయ పాలనా సంస్థ డైరెక్టర్ రామచంద్రరావు పాల్గొన్నారు.



అంతర్రాష్ట్ర జిల్లా కలెక్టర్ల సమావేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అంతర్రాష్ట్ర మధ్యం సరఫరాకు సంబంధించి సూర్యాపేట నాగార్జున సిమెంట్ మిట్టపల్లి వద్ద నిర్వహించిన అంతర్రాష్ట్ర జిల్లా కలెక్టర్ ల సమావేశం జరిగింది. అందులో ప్రధానంగా అనుమతి లేని మద్యం సరఫరా గురించి, తీసుకోవాల్సిన చర్యలు విషయమై చర్చించారు. సమావేశంలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి,ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న మానవ అక్రమ రవాణా నిర్మూలన విభాగం , ఆర్.పి.ఎఫ్ సిబ్బంది

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అపరిచిత వ్యక్తుల పట్ల ప్రతి ఒక్కరూ ముఖ్యంగా మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని మానవ అక్రమ రవాణా నిర్మూలన విభాగం,పోలీసు శాఖ , రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట రైల్వే స్టేషన్ లో సోమవారం పల్నాడు జిల్లా స్థాయిలో మానవ అక్రమ రవాణా నిర్మూలన విభాగం, పోలీసు శాఖ, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రైల్వే ప్రయాణికులకు పసి పిల్లల ఎదుగుదల గురించి, వారి హక్కుల గురించి, వారు తీసుకోవలసిన జాగత్త గురించి వివరించారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన గురించి వాటికి సంబంధించిన సమస్యల అవగాహన గురించి, ఆడపిల్లల లైంగిక వేధింపులు ,రక్షణ పొందేందుకు, తగు జాగ్రత్తలు తీసుకునేందుకు,అపరిచిత గుర్తు తెలియని వ్యక్తుల బారి నుండి తమను ఎలా రక్షించుకోవాలో,వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.. ఆయా సమస్యలు ఎదుర్కొం టుంటే 1098,100,181,112 టోల్ ఫ్రీ నంబర్లలో సం ప్రదించాలని సూచించారు. సదస్సులో ఏ హెచ్ టు ఎస్పై అల్లూరి రెడ్డి ఆర్పిఎఫ్ ఐ.సుభాని, ఎహెచ్ టు వుమెన్ హెడ్ కానిస్టేబుల్ మంగ, హెడ్కానిస్టేబుల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



వైసిపిలోకి పలువురి చేరిక

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన 12 కుటుంబాల వారు వైఎస్సార్సీపీలో చేరారు. సోమవారం క్రోసూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్వయంగా కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో దండు సైదా, దండు హుస్సేన్, దండు సలాం, దండు పెద్ద మస్తాన్ వలి, గరికపాటి దస్తగిరి తదితరులు ఉన్నారు.

అప్పు తిరిగి చెల్లించాలంటే వేధింపులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జగనన్నకు చెబుదాం ఫిర్యాదులకు సకాలంలో పరి ష్కార మార్గం చూపాలని పోలీసు ఉన్నతాధికారులను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగన్నన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీక రించిన ఎస్పీ మాట్లాడుతూ ఉద్యో గాలు ఇప్పిస్తామని మోసం,ఆన్లైన్ ద్వారా నగదు అపహరణ, కుటుంబ, ఆర్థిక, ఆస్తి,పొలం,ఆర్థిక పరమైన మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందాయన్నారు. కార్య క్రమం లో డీఎస్పీలు కె.వి మహేష్, బి. ఆది నారాయణ, యు.రవిచంద్ర, పాల్గొన్నారు.

రెంటచింతల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుండుకోట గ్రామానికి చెందిన ఒక మహిళను తన చిన్న కుమారుడు ఆస్తి తన పేరు మీద రాయాలని లేకపోతే చంపుతానని శారీ రకంగా మానసికంగా హింసిస్తూ ఉన్నాడని అతనిపై తగిన చర్యలు తీసుకొని, తనకు రక్షణ కల్పించాలని కుమారుడిపై కన్నతల్లి ఫిర్యాదు చేశారు.

అచ్చంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రంథసిరి గ్రామానికి చెందిన ఒక వద్ధుని ఇంటిని కుమార్తె ఆక్రమించుకొని,ఇంట్లో నుండి గెంటివేయాలని చూస్తుందని తనకు న్యాయం చేయాలని ఎస్పీకి వద్ధుడు ఫిర్యాదు చేశారు.

నరసరావుపేట రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరి ధిలో నివాసం ఉండే వద్ధురాలు తన భర్త చనిపోగా ప్రస్తుతం వృద్ధాశ్రమంలో ఉంటున్నట్లు, పిల్లల్ని చూడడానికి వెళ్తే వాళ్ళు ఆస్తిని స్వాధీనం చేసుకొని బయటికి గెంటివేసినట్లు,వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

సత్తెనపల్లికి చెందిన ఉద్యోగ విరమణ పొందిన మహిళ ఉపాధ్యాయురాలు రూ 35 లక్షలను చిలకలూరి పేట పట్టణానికి చెందిన వ్యక్తికి అప్పుగా ఇవ్వగా అతను తిరిగి చెల్లించకుండా బెదిరిస్తున్నాడని న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

కుమార్తెను వేధిస్తున్నారని ఫిర్యాదు

ఇంటికి సమీపంలో ఉండే యువకుడు సమీప బంధువు గోగిరెడ్డి తిరుపతిరెడ్డి మైనర్ అయిన తన కుమార్తెను వేధిస్తున్నాడని పెళ్లి చేసుకోవాలని ఇబ్బందులు పెడుతున్నాడని దీనిపై పెద్ద మనుషుల సమక్షంలో రాజి చేసుకున్నప్పటికీ తిరుపతి రెడ్డి వైఖరి లో ఎటువంటి మార్పు లేకపోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశారని కోసూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన యువతి తండ్రి అప్పిరెడ్డి అన్నారు.

కొడుకు వేధిస్తున్నాడు



తమ కుమారుడికి సంబంధం లేకుండా విడిగా ఉంటున్నప్పటికీ పక్క పోర్షన్ లో కూడా ఉండనీయకుండా ఇబ్బందులు పెడుతున్నాడని, కోడలు మాటలువిని కొడుకుదాడి చేస్తున్నాడని వృద్ధ దంపతులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈపూరు పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఎస్పీ కార్యాలయం ఫిర్యాదు చేశామని చెప్పారు.

అప్పు చెల్లించినా వేధింపులు



వినుకొండ కు చెందిన బియ్యం వ్యాపారి వట్టికొండ శ్రీనివాసరావు తన ఇంటిలో కొన్నేళ్లుగా అద్దెకి ఉంటున్నా డని ఈ నేపథ్యంలో అతని వద్ద రూ 8 లక్షల అప్పు తీసుకొని తిరిగి వడ్డీతో సహా చెల్లించానని ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో ఇంటిని విక్రయించి ఇల్లు ఖాళీ చేయ మన్నందుకు మద్యం సేవించి అతని స్నేహి తులతో కలిసి ఇంటి మీదకు వచ్చి దాడి చేసి కొటారని దీనిపై వినుకొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశానని వినుకొండకు చెందిన చేకూరి సత్య నారాయణ అన్నారు.



జగనన్నకు చెబుదాం అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి

పొలాన్ని ఆక్రమించారు



పసుపు, కుం కుమ కింద రాజుపాలెం మండలం అనుపాలెంలో తల్లి దండ్రులు పెట్టిన 67 సెంట్లు పొలాన్ని వ్యక్తిగత తగాదాల నేప థ్యంలో అదే గ్రామా నికి చెందిన మాజీ వియ్యంకుడు ముట్లూరు వెంకటేశ్వర్లు ఆక్రమించుకోవాలని చూస్తు న్నారని మాచర్లకి చెందిన శానంపూడి రామకోటమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. పొలంలోకి అడుగుపెడితే చంపేస్తానని బెదిరిస్తున్నాడని దీనిపై గతంలో రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఫలితం లేదని చెప్పారు.

అప్పు చెల్లించాలన్నందుకు దుర్భాషలు



వ్యాపార ఖర్చుల నిమిత్తం 2021 లో రూ 3.50 లక్షలను అప్పుగా తీసుకున్న నాము శ్రీనివాసరావు, రజిని దం పతులను తిరిగి అప్పు చెల్లించమని అడిగితే దుర్భాషలాడుతున్నా రని మండల కేంద్రం ముప్పాళ్లకు చెందిన షేక్ మీరావలి ఫిర్యాదు చేశారు. నరస రావుపేట లో ఉన్న బట్టల దుకాణం వద్దకు వెళ్లి ఇదేమని ప్రశ్నిస్తే అప్పు చెల్లించేది లేదని ఏం చేస్తావో చేసు కోవాలంటూ బెది రింపులకు పాల్పడుతున్నారని, తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

పంట నష్టపరిహారం ఇప్పించాలని వినతి



వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో 1.98 సెంట్ల పొలంలో సాగు చేసిన కంది,పత్తి పంట లను ధ్వం సం చేయడమే కాకుండా నకిలీ పత్రాలు సృష్టించి పొలాన్ని కాజే యాలని చూస్తున్న వడితే శంకర్ నాయక్ పై చర్యలు తీసుకోవాలని రెంటచింతల మండలం జెట్టిపాలెంకి చెందిన ముడావత్ గోపాల్ నాయక్ వేడుకున్నారు. రెంటచింతల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే విచారణ జరిపినా న్యాయం చేయలేదన్నారు. నష్టపరిహారం చెల్లించడంతో పాటు రక్షణ కల్పించాలని కోరారు.

స్నేహితుడికి డబ్బిస్తే మోసం చేశాడు



పిల్లల చదువులు ఆగిపోతాయని డబ్బు అప్పుగా ఇవ్వాలని కోరిన స్నేహితునికి తాను కొంత నగదుతో పాటు మరికొంత అప్పులు చేసి రూ 10 లక్షలు ఇస్తే తిరిగి చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నాడని సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఇదేమని నిలదీస్తే తన పేరుతో ఉన్న ఇంటిని రిజిస్టర్ చేశాడని, ఇంటిని ఖాళీ చేయకుండా ఇబ్బంది పెడుతున్నాడని న్యాయం చేయాలని ఎస్పీని వేడుకున్నారు.

కలెక్టర్ 'స్పందన'కు170 అర్జీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ సేవలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా పరిష్క రించేందుకు కృషి చేస్తామని, ఆయా సమస్యలు పరిష్కారం అయ్యే లోపు అర్జీదారులు సమన్వయం పాటించాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం "జగనన్నకు చెబుదాం" స్పందన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారులు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.



సర్పంచ్ దౌర్జన్యంపై ఫిర్యాదు

1972 లో అప్పటి ప్రభుత్వ ఆదేశాలు మేరకు 21 మంది పేదలకు కుటుంబానికి 90 సెంట్లు చొప్పున పంపిణీ చేసి పట్టాలు మంజూరు చేశారని, అప్పటి నుండి ఆ పొలాలను వంశపారపర్యంగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే కొంత కాలంగా సర్పంచ్ కంచర్ల బాబు తమ పొలాల ద్వారా గుండ్లకమ్మ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాడని నూజెండ్ల మండలం ములకలూరు గ్రామానికి రైతులు మందా వెంకటేష్, మందా యోగేశ్వరరావు, మందా నరసయ్య, మందా వెంకట్రావు, మందా రామారావు తదితరులు ఫిర్యాదు చేశారు.తమ ప్రశ్నిస్తే అధికార అండదం డలతో పొలా లను ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడని చెప్పారు. ఇసుక త్రవ్వకాలు నిలిపివేయాలని తమ పొలాలకు తమకు రక్షణ కల్పించాలని కోరారు.

పట్టా ఇప్పించాలని వికలాంగుడు వినతి



తరతరాలుగా తన కుటుంబ సభ్యులు సాగు చేసుకుంటున్న అటవీ భూమికి సాగు హక్కులు కల్పిస్తూ పట్టా మంజూరు చేయించాలని నకరికల్లు మండలం గుళ్లపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు దాచేపల్లి మౌలాలి వేడుకున్నారు. ప్రస్తుతం ఆ భూమే తన కుటుంబానికి ఆధారమని సాగుహక్కులు కల్పించాలని కోరారు.

శ్మశాన వాటిక స్థలం కేటాయించండి



నరసరావుపేట మండలం ములకలూరు గ్రామంలో ఎస్సీ మాదిగలకు స్మశాన వాటిక స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు చింతరాల మీరయ్య జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. ఎనిమిదేళ్ల క్రితం దాత ముందుకు వచ్చి 67 సెంట్లు స్థలాన్ని స్మశాన వాటికకు ఇచ్చారని దీనికి సం బంధించి అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉందని దీనిపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమస్య పరిష్కరించాలని కోరారు.

కబ్జాలో ప్రభుత్వ స్థలాలు



కబ్జాలో ప్రభుత్వ స్థలాలను కాపాడాలని నియోజకవర్గ టిడిపి బాద్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు జగనన్నకు చెబుదాంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో భూములకు రక్షణ లేదని పట్టణంలోని స్థానిక 5వ వార్డులో ఎకరం రూ.5 కోట్లకు పైగా పలికే నాలుగున్నర ఎకరాలు వల్లపు చెరువు వద్ద దేవాలయ భూములు, ఉప్పలపాడు వద్ద 200 ఎకరాల వెంచర్ లో 45 ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా ఎమ్మెల్యే కనుసన్నల్లో కబ్జాకు గురైం దన్నారు.అధికార పార్టీ నాయకుల కబ్జాలు ,దుర్మార్గాలపై అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలకు ఆధీనంలోకి తీసు కోవాలని కోరారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి



పల్నాడు జిల్లాలో అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం భారత్ బచావో జిల్లా అధ్యక్షులు వి కోటా నాయక్ విలేకరులతో మాట్లాడుతూ మాచర్ల నరసరావుపేట రోడ్డు గోతులు మయంగా మారిందని నిత్యం ఎన్నో ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయని అన్నారు.

విధులను విస్మరించడమూ అవినీతే

సంక్షేమ పథకాలలో అవినీతి అక్రమాలు, పన్ను ఎగవేతలపై రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్సుమెంట్, గుంటూరు

ప్రజాశక్తి-గుంటూరు

అవినీతి రహిత సమాజం కోసం చట్టంపై ఆవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సెమినార్‌లో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, అడిషనల్ ఎస్పీ సుప్రజా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు, గుంటూరు అడిషనల్ ఎస్పీ ఎం.మహేంద్ర, డిఆర్ఓ కె.చంద్రశేఖర రావు, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కె.స్వాతి, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ కరీం పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ లంచగొండితనం నేరమని, లంచం ఇచ్చిన వారు, లంచం పుచ్చుకున్న వారు చట్ట ప్రకారం నేరస్తులన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందించేందుకే రాష్ట్రంలో భారీ ఎత్తున అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకే డీబీటీ ద్వారా నిధులు జమ చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు తాము నిర్వహించాల్సిన పనులను చేయకపోవడం కూడా ఆవినీతిగానే పరిగణించాల్సి వుంటుందన్నారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ వ్యవసాయాన్ని చేస్తున్న రైతులు కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, కల్తీ క్రిమిసంహారక మందులతో నష్టపోతున్నారని, వీటి నివారణకు అవసరమైన విజిలెన్స్, ప్రభుత్వ సిబ్బంది ఉన్నా రైతులు నకిలీలతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జేసీ రాజకుమారి మాట్లాడుతూ కల్తీని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలు, యూనిట్ చేపట్టిన తనిఖీలు, ప్రగతి గురించి వివరించారు. సుమారు రూ.8.50 కోట్ల నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం అందరితో జిల్లా కలెక్టర్ సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ సిఇఓ జే.మోహన్‌రావు, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, ఎస్సీ వెల్ఫేర్ డిడి మధుసూదనరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

టిజెపిఎస్ కాలేజిలో ఖాదీ మహోత్సవ్

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక టిజెపిఎస్ కాలేజిలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం 'ఖాదీ మహోత్సవ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎ.బి.పి.మనోహర్ మాట్లాడుతూ బ్రిటిష్ వారిని దేశం నుండి పారద్రోలే క్రమంలో మహాత్మాగాంధీ నాయకత్వంలో ఖాదీ ఉద్యమం ఎంతో కీలకంగా మారి, భారతీయులలో దేశభక్తి భావం ఏర్పరచి, అందర్నీ ఏకం చేసిందని వివరించారు. స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించి వ్యాపార రంగాల్లో సరికొత్త విప్లవం తెచ్చిందన్నారు. వారి సేవలకు గుర్తుగా అక్టోబర్ 2 గాంధీ జయంతి నుండి 31వరకు ఖాదీ వస్త్ర విశిష్టత గురించి, ఖాదీ వస్త్ర ప్రయోజనాల గురించి వివరించే కార్యక్రమాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్ ఆర్.జయశైలజ, అధ్యాపకులు పి.నాగమణి పాల్గొన్నారు.



సాగు నీరివ్వకుంటే రహదార్లను దిగ్బంధనం చేస్తాం : నరేంద్ర

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొలాలు ఎండిపోయి వాహనాలు నడిపేలా తయారయ్యాయని, సత్వరమే సాగు నీరివ్వకుంటే రహదార్లను దిగ్బంధనం చేస్తామని మాజీ ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పొలాలకు సాగునీరు అందక, రూ.లక్షలు పెట్టుబడి పెట్టిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, పట్టిసీమ ద్వారా నీటిని మళ్లించే అవకాశం ఉన్నా, పులిచింతల ప్రాజెక్టులో 37 టీఎంసీల నీరున్నా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. రైతులే చందాలేసుకుని పంటల కాల్వలను బాగు చేసుకుంటున్నారని, ఇటీవల జిల్లా కలెక్టర్ అనుమర్లపూడికి వెళ్తున్న సమయంలో స్థానిక రైతులు ఆయన్ను ఆపి కాల్వను చూపి నీరు ప్రవహించేలా చూడాలని విన్నవించారని, అయినా చర్యలు తీసుకోలేదని, చేబ్రోలు హై లెవెల్ ఛానలుకు మరమ్మతులు చేయించాలి జాయింట్ కలెక్టర్‌ను రైతులు ఆశ్రయించినా స్పందన లేదని అన్నారు. చెప్పారు. శుద్ధపల్లి, ములుకుదురు, మాచవరం, నిడుబ్రోలు, వడ్డిముక్కల, మన్నవ గ్రామాల్లో లిఫ్ట్ ఇరిగేషన్లను నిరుపయోగంగా మార్చారని, సుద్ధపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పైపులను అధికార పార్టీ నాయకులు ఎత్తుకెళ్లారని ఆరోపించారు. మంత్రి అంబటి రాంబాబుపై దాడిని తాము సమర్థించడం లేదని, అయితే ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు. ఆయన సొంత నియోజకవర్గంలోనే మిర్చి పంటను నీరు లేక రైతులు పీకేస్తుంటే మంత్రికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. అనవసర విమర్శలు మానుకుని రైతులకు నీటి విషయంపై ఆలోచించాలని హితవు పలికారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



నిత్యం రైతులు మహిళలు, చిన్నారులు తిరిగే ప్రాంతం.. ఏ క్షణానైనా ప్రమాదం జరగవచ్చు. అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. కుంచనపల్లికి చెందిన గౌర కోటయ్య ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభం కొన్ని నెలలుగా ఒరిగి ఉంది. ఇటీవల అకాల వర్షాలు కురిసినప్పుడు విద్యుత్తు లైన్లు కూడా కిందకి వంగి వేళ్లాడుతున్నాయి. కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తీసివేసి, మరొక స్తంభం వేయాలని స్థానికులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏమైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ఇక్కడి వారు ప్రశ్నిస్తున్నారు.

కెఎల్‌యుకు 5జి యూజ్ కేస్ ల్యాబ్ కేటాయింపు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్


ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2023 (ఐఎం) డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ప్రారంభోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 5జి యూజ్ కేస్ ల్యాబ్‌ను కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ సోమవారం తెలిపారు. ఈ ల్యాబ్ ద్వారా 5జి కోర్ నెట్‌వర్క్ ప్లాట్‌ఫారమ్‌ని ఉపయోగించి తక్కువ సమయంలో వేగంగా పనిచేసే కమ్యూనికేషన్ వ్యవస్థను రూపొందించవచ్చని అన్నారు. తద్వారా అత్యాధునిక 5జి ల్యాబ్ వినియోగ – కేసులు అభివృద్ధి చేయబడతాయన్నారు. 5జి యూజ్ కేస్‌ల్యాబ్ ప్రారంభం వల్ల వర్సిటీలోని అకడమిక్స్‌ను మెరుగుపరుస్తుందన్నారు. దీంతో పాటు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), బిగ్ డేటా అనాలిసిస్, అగ్రికల్చర్, ట్రాన్స్‌పోర్ట్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాల్లో నూతన ఆవిష్కరణలతో పాటు పరిశోధనలకు, ఉత్పత్తుల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. 5జి ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించి మెషినరీలో లోటుపాట్లను, ఆరోగ్య పరీక్షలను కూడా నిర్వర్తించవచ్చని తెలిపారు. పరిశోధక విభాగం ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకట రత్నం మాట్లాడుతూ 5జి వినియోగ కేస్ ల్యాబ్‌కు భారీ ఉత్పత్తి, అభివృద్ధికి సామర్థ్యం ఉందన్నారు. దేశంలో 6జిని కూడా అభివృద్ధి పరచే ప్రయత్నాలు, ఆవిష్కరణలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డా ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డా.కె.సుబ్బారావు, టెలికమ్యూనికేషన్స్ విభాగం దినేష్ పాల్గొన్నారు.


ధ్రువపత్రాన్ని చూపుతున్న కెఎల్‌యు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు

యుఎస్‌ఎఫ్‌తో ఎస్ఆర్ఎం ఒప్పందం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా (యుఎస్‌ఎఫ్)తో ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం విద్యాపరమైన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. అధ్యాపకులకు లోతైన శిక్షణ, పరస్పర పరిశోధనలు, సాంకేతికత మార్పిడులు, వర్క్‌షాప్‌ల నిర్వహణ కోసం రెండు యూనివర్సిటీలకు ఎంఒయు కుదిరింది. యూనివర్సిటీ ఆవరణలో సోమవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో యూఎస్‌ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కి కీ కరుసన్, ఏపీ ఎస్ఆర్ఎం వైస్ ఛాన్సలర్ డాక్టర్ మనోజ్ కుమార్ అరోరాలు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమానికి ఫ్లోరిడా యూనివర్సిటీ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రశాంత్ మహాపాత్ర నేతృత్వం వహించారు. ఉమ్మడి పరిశోధనలను దశల వారీగా విస్తృత పర్చుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఆర్ఎం వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా అభిప్రాయపడ్డారు. బోధనా పరమైన భాగస్వామ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని, దీనివల్ల అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను పెంచుకునే వీలుందని చెప్పారు. గ్లోబల్ అకడమిక్ ఎక్సలెన్స్‌కు ఈ ఎంవోయూ దోహదపడుతుందని యూఎస్‌ఎఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమకుమార్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్ డాక్టర్ శ్వేత, డీన్లు డాక్టర్ రంజిత్ థాపా, డాక్టర్ మన్నాథన్ పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను చూపుతున్న డాక్టర్ మహాపాత్ర, డాక్టర్ కి కీ కరుసన్, ఎస్ఆర్ఎం వీసీ డాక్టర్ మనోజ్



మెషీన్ లెర్నింగ్ అల్గోరిథమ్స్ - అప్లికేషన్స్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు డాక్టర్ వసంత రుద్రమళ్ల, డాక్టర్ నీలిమ గుంటుపల్లి రాసిన మెషీన్ లెర్నింగ్ అల్లరిథమ్స్ – అప్లికేషన్స్ పాఠ్య పుస్తకాన్ని వీసీ పి.రాజశేఖర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయితలు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్‌లో మెషీన్ లెర్నింగ్ ఒక ముఖ్య భాగమని, దీనిని సెల్ఫ్ డ్రైవింగ్ కార్స్, మెడికల్ డయాగ్నస్టిక్స్, డ్రోన్స్, జీపియస్ వంటి వాటిలో ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ పుస్తకం ద్వారా మెషీన్ లెర్నింగ్ అల్గోరిథమ్స్‌ను విశదీకరించామని రచయితలు తెలిపారు. దీనితో పాటు వారు రూపొందించిన 'నానో డ్రోన్స్ ఫర్ మాన్యువల్ ఫిషర్ మెన్ రెస్క్యూ' డిసైన్‌కు గ్రాంట్ అయిన యూకే పేటెంట్ సర్టిఫికెట్లను వీసీ అందుకున్నారు. ఆవిష్కరణలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు, దూరవిద్య కేంద్రం డైరెక్టర్, నూటా ప్రెసిడెంట్ డాక్టర్ బి.నాగరాజు, డాక్టర్ బి.బసవేశ్వరరావు, డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ యు.సూర్యకామేశ్వరి, ఎ.పుష్పలత పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా - ఇండియా సాంగత్యంపై నేడు ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఆస్ట్రేలియన్ స్టడీస్ విభాగం అధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని రిజిస్ట్రార్ బి.కరుణ సోమవారం తెలిపారు. సమావేశంలో ముఖ్య అతిథిగా ఆస్ట్రేలియా కౌన్సెల్ జనరల్ శార కిర్లు 'ఆస్ట్రేలియా – ఇండియా సాంగత్యం'పై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు డైక్‌మన్ ఆడిటోరియంలోని బాలమోహన్‌దాస్ సెమినార్ హాల్లో నిర్వహించే సమావేశానికి వీసి పి.రాజశేఖర్ చీఫ్ ప్యాట్రన్‌గా హాజరవుతారని, ప్రత్యేక అతిథులుగా రెక్టార్ పి.వరప్రసాద్‌మూర్తి, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లతోపాటు ఇంటర్నేషనల్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఎన్ఎస్ఎస్‌లో ప్రతిభ చూపిన వారికి నేడు అవార్డులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో వర్సిటీ పరిధిలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులతో నేడు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం సమన్వయకర్త డాక్టర్ డి.రవిశంకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ప్రొఫెసర్ ఎల్.వేణుగోపాల్‌రెడ్డి సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సభకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఎన్ఎస్ఎస్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లకు అవార్డులను ప్రదానం చేస్తామని, ముఖ్య అతిథిగా వీసీ పి.రాజశేఖర్, ప్రత్యేక అతిథిగా స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ పి.అశోక్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

వికలాంగులు, పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి : స్థానిక కొత్త బస్టాండ్ వెనుక గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ రాష్ట్ర కార్యాలయంలో వికలాంగులకు పేదలకు సోమవారం అన్నదానం చేశారు. కొంక పిచ్చమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు కొంకా కోటి, మరియమ్మ కలిసి 50 మందికి భోజనాలు సమకూర్చినట్లు ట్రస్ట్ సెక్రటరీ జి.డేవిడ్ తెలిపారు. కార్యక్రమంలో కె.రామారావు, బి.గోవిందరాజు, మైకేల్ ప్రిన్స్, చరణ్, బి.యాకోబు, జి.అరుణ, కె.అరుణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిన్నమనేని మురళీకృష్ణ

డిసెంబర్ 19, 20 తేదీల్లో మంగళగిరిలో బాలోత్సవం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి - తాడేపల్లి రెండో బాలోత్సవాన్ని డిసెంబర్ 19, 20 తేదీల్లో మంగళగిరి సమీపంలోని డాన్‌బోస్కో స్కూల్లో నిర్వహిస్తామని రాష్ట్ర బాలోత్సవ కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ ప్రకటించారు. ఈ మేరకు సన్నాహక సమావేశం పట్టణంలోని గౌతమ్‌బుద్ధ రోడ్‌లోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించారు. సమావేశానికి నిర్మల విద్యాసంస్థల డైరెక్టర్ వివి ప్రసాద్ అధ్యక్షత వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రెండ్రోజులపాటు జరిగే బాలోత్సవాలకు వేలమంది విద్యార్థులను సమీకరించాల్సి ఉంటుందని చెప్పారు. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకే వీటిని నిర్వహిస్తున్నామని, బాలలకు చేసే సేవ భవిష్యత్ తరానికి చేసే సేవ లాంటిదని అన్నారు. గతంలో బాలోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు ప్రేరణ పొంది ఉన్నత స్థాయికి ఎదిగిన వారు కూడా ఉన్నారని గుర్తు చేశారు. విద్య మానవ విలువలను పెంచే విధంగా ఉండాలన్నారు. వివి ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్స్ 35 ఉన్నాయని, వీటన్నింటి నుండి విద్యార్థులను ఉత్సవాల్లో భాగస్వామ్యం చేద్దామని చెప్పారు. సమావేశంలో మంగళగిరి - తాడేపల్లి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీపతిరావు, ఉపాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వర రావు, కార్యదర్శి విజె విద్యాసంస్థల డైరెక్టర్ పి.రాజశేఖర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఐ.అనిల్ చక్రవర్తి, సీకే జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ ఎం.విజయ మోహన్‌రావు, జిఎస్ఆర్ మోహన్‌రావు, పి.ఐజాక్ న్యూటన్, బాలోత్సవం కోశాధికారి జి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వివిఐటిలో న్యూ ఇండియా ఇన్ అమృత్‌కాల్ ఇయర్స్

ప్రజాశక్తి-తెనాలి



30టీఎన్ఎల్01-మాట్లాడుతున్న దినేష్‌కుమార్

పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో ఇండియా ఫౌండేషన్, ఏపి అండ్ తెలంగాణా యంగ్ థింకర్స్ ఫోరం సంయుక్తంగా నిర్వహించిన న్యూ ఇండియా ఇన్ అమృత్‌కాల్ ఇయర్స్ కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి, గుంటూరు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎం.దినేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వారి ఆశయాల సాధనకు 2022 నుంచి 2047వరకూ గల 25 ఏళ్ల అమృత్‌కాల్ సమయం కీలకమన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దటంలో యువత పాత్ర కీలకమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడు ప్రాధాన్యతలతో కూడిన అమృత్‌కాల్ ప్రణాళిక ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. యువత నూతన ఆవిష్కరణలకు అమృత్‌కాల్ ఆర్థిక సహకారాన్ని కూడా అందిస్తుందని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రీన్ గ్రోత్‌పై ప్రభుత్వం దృష్టి సారించిందని, ఫ్యూయల్ ఎనర్జీ, బిల్డింగ్ వంటి రంగాల్లో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.వై భానుమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు

స్కేటింగ్‌లో నెక్ట్స్ జెన్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బిఆర్ స్టేడియంలో రెండ్రోజులపాటు జరిగిన స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో నెక్ట్స్ జెన్ రోల్ స్కేటింగ్ అకాడమీ విద్యార్థులు పతకాలు సాధించినట్లు అకాడమీ కోచ్ అరుణ్‌బాబు తెలిపారు. అకాడమీ విద్యార్థులు వి.మోక్షిత్ రామ్, పి.నితీష్, జె.రేవంత్ చౌదరి, టి.ఉద్దీప్ త్రివేది, జి.ధృవ్, ఎన్.సోఫియా, ఎస్.హేమణ్య బంగారు పతకాలు సాధించారని తెలిపారు. జె.సాయిరామ్ కృష్ణారెడ్డి, టి.మణి మోదక్ వెండిపతకాలు సాధించారన్నారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులకు నెక్ట్స్‌జెన్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జె.హరిబాబు శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్ స్పందనకు 194 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా నలుమూలల నుండి తమ సమస్యల పరిష్కారానికి స్పందనలో ప్రజలు అందించిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని అధికారులను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో అర్జీలను కలెక్టర్‌తోపాటు సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, సమగ్ర శిక్ష ఎపిసి విజయలక్ష్మి స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారు 194 అర్జీలను ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సిఇఒ జె.మోహన్‌రావు, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణబాబు తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో స్టాల్‌కు అనుమతివ్వాలి




గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో స్టాల్ ఏర్పాటు చేసుకోవటానికి అనుమతిస్తూ గతంలో కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం అధికారులు సహకరించాలని ఏటి అగ్రహారంకు చెందిన వికలాంగుడైన కె.వెంకటేశ్వరరావు స్పందనలో అర్జీ అందచేశారు. వికలాంగుల కోటాలో జిజిహెచ్‌లో స్టాల్ ఏర్పాటు చేసుకోవటానికి ఈ ఏడాది జూన్‌లో కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని, ఆ మేరకు స్టాల్ ఏర్పాటుకు మెటీరియల్ కూడా కొనుగోలు చేశానని చెప్పారు. అయితే తర్వాత జిజిహెచ్ సూపరింటెండెంట్ మారటంతో తనకు స్టాల్ ఏర్పాటుకు అవకాశం లేదని చెప్పారన్నారు. కావున తనకు న్యాయం చేయాలని కోరారు. దాదాపు రూ.60 వేల విలువైన మెటీరియల్ కూడా సిద్ధం చేసుకున్నానని, షెడ్డు ఏర్పాటు చేసుకోకపోవటంతో అది పాడవుతుందన్నారు. తనకు స్టాల్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించి, కుటుంబ పోషణకు ఆదారం చూపాలని కోరారు.



కాలనీ రోడ్డును ఆక్రమించారు

తమ కాలనీకి వెళ్లే రోడ్డు ఆక్రమణలు తొలగించి, రోడ్డు సౌకర్యం కల్పించాలని ఫిరంగిపురం మండలం, అమీనాబాద్ పంచాయతి వేములూరుపాడుకు చెందిన ఎస్సీ కాలనీ వాసులు స్పందనలో అర్జీ అందచేశారు. 15 ఏళ్లుగా కాలనీలో దాదాపు 400 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, కాలనీకి వెళ్లే రహదారికి ఇటీవల మండల గ్రాంట్ ద్వారా సిమెంట్ రోడ్డు నిర్మాణం చేయించుకున్నామని చెప్పారు. అయితే పచ్చల వెంకటేశ్వరరావు, సత్యం తదితరులు రోడ్డును ఆక్రయించారని, తమకు దారి లేకుండాపోయిందని అన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు జెసిబితో తొలగించే ప్రయత్నం చేయగా ఆక్రమణదారులు కిరోసిన్ పోసుకొని బెదిరించటంతో అధికారులు అక్కడి నుండి వెళ్లిపోయారన్నారు. ఆ తర్వాత ఆక్రమణలు తొలగించటానికి అధికారులు రావట్లేదని, ఉన్నతాధికారులు స్పందించి వందల కుటుంబాలు నివసిస్తున్న తమ కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో పచ్చల ఐజాక్, జె.అన్నెబాబు, వి.వినయ్‌కుమార్ తదితరులున్నారు.

జిఎంసి స్పందనకు 24 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఇన్‌ఛార్జి కమిషనర్ పి.వి.కె.భాస్కర్ స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను భాధ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో పట్టణ ప్రణాళిక విభాగానికి 9, ఇంజినీరింగ్ విభాగం 7, రెవెన్యూ విభాగం 6, ప్రజారోగ్య విభాగం 2 చొప్పున మొత్తం 24 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ నిన్‌ఛార్జి) సిహెచ్.శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసిపిలు, ఈఈలు, ఎస్-ఎస్‌లు, సూపరిండెంట్లు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు



వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవకుమార్ సల్లూరికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏ నోవెల్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ సివియారిటీ ప్రెడిక్షన్ ఆఫ్ డయాబెటిక్ రెటినోపతీ' అనే అంశంపై దేవకుమార్ పరిశోధన చేశారని తెలియజేశారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ కేవీ కృష్ణకిషోర్ గైడ్‌గా వ్యవహరించారన్నారు. పిహెచ్‌డి పొందిన సందర్భంగా దేవకుమార్‌ను వీసీ ఆయా విభాగాల డీన్లు, అధిపతులు అభినందించారు.

ఇవిఎం గోడౌన్లు తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



మాసంత తనిఖీల్లో భాగంగా గుంటూరు ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఇవిఎంలను భద్రపరిచిన గోడౌన్‌ను, ఫిరంగిపురం మండలం, రేపూడిలోని వ్యవసాయ మార్కెట్‌లో వీవీపాట్స్ భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఇవిఎంల భద్రత విషయంలో రాజపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలూ పకడ్బందీగా చేపట్టాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యమ్రకంలో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, గుంటూరు ఆర్డీవో పి.శ్రీఖర్, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ సాంబశివరావు, ఫిరంగిపురం తహశీల్దార్ పద్మనాభుడు, వివిధ పార్టీల ప్రతినిధులు బిల్లా సునీల్, డాక్టర్ సేవాకుమార్, వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు.